క్లుప్తంగా

జ్ఞాన సరస్వతికి విశేష పూజలు


విశేష అలంకరణలో జ్ఞాన సరస్వతి అమ్మవారు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేసింది.

కోదండ రామాలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో కోదండరాముడు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురం కోదండ రామాలయంలో కోదండ రామునికి విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా మండప ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకాలు, నీరాజనం మంత్ర పుష్పాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

4న అయ్యప్పకు..


అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో కొలువైన హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో జూన్ 4వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి మండపారాధన, పుణ్యాహవచనం, మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ముత్యాలమ్మకు..


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ దంపతుల అధ్వర్యంలో అమ్మవారికి నిత్యకైంకర్యాలతో పాటు కుంకుమాది పూజలు నిర్వహించారు. అర్చకులు బాదంపూడి వెంకట సూర్య సీతారామ శర్మ పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ధర్మరాజు, చిన్ని నాగేశ్వరరావు, నాగమణి, కాళహస్తి నిరంజన్ కుమార్, సరోజిని దంపతులు, బ్రహ్మం చోడవరపు రంగ దర్శించుకున్నారు.

110 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం: సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతి సందర్భంగా మురళీకృష్ణ మహేష్ యువసేన, ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జంగారెడ్డిగూడెం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ప్రారంభించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు వైద్యసేవలు అందించారు. 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 9 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి, నిడదవోలు లయన్స్ ఆసుపత్రికి పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఏలూరు వైభవ్ ఆదర్శ లయన్స్ క్లబ్‌చే 35 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కాళహస్తి నిరంజన్ కుమార్, సరోజిని, ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ, మహేష్ యువసేన అభిమానులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణం ప్రారంభం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం షెడ్లు నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ చైన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆలయంలో భూమి పూజ నిర్వహించారు. భూమి పూజ అనంతరం రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ షెడ్డు నిర్మాణానికి నూతన కమిటీ అధ్యక్షుడు రొంగల నాగేశ్వరరావు, రమాదేవి దంపతులు రూ.50,116, కాళ్ల అప్పలనాయుడు, రాములమ్మ దంపతులు రూ.50,116 విరాళంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో కుంటుపడిన విద్యా వ్యవస్థ

- ఊరిస్తున్న తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు


చింతలపూడి: జగనన్న గోరుముద్ద పథకంలో రుచికరమైన భోజనం చేస్తున్న పిల్లలు(ఫైల్)

చింతలపూడి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. తల్లికి వందనం, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, నిరుద్యోగ భృతి ఇలా ప్రతి హామీని గాలికొదిలేశారు. ఎన్నికల్లో కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకంలో ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. గత ఏడాది తల్లికి వందనం పథకాన్ని అటకెక్కించారు. ఈ ఏడాది మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇంత వరకు ప్రకటనలు తప్ప తల్లికి వందనం గురించి ఊసే లేదు. అదే విధంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఖాతాల్లో జమ చేస్తానని హామీ ఇచ్చి మొదటి ఏడాది చేతులెత్తేశారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న తరుణంలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. దీనిపై తమకు నమ్మకం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

వైఎస్ జగన్ హయాంలో..

రాష్ట్రంలో గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ఏటా చెప్పిన సమయానికి అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ట్యాబ్‌లు ఐబీ సిలబస్, విద్యా దీవెన, వసతి దీవెన, పేదలకు విదేశీ విద్యా దీవెన పథకాలను సక్రమంగా అమలు చేసి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టింది వైఎస్ జగన్ ప్రభుత్వం. ప్రైవేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసింది. నియోజకవర్గంలో అమ్మఒడి పథకం కింద 28,966 మంది లబ్ధిదారులకు రూ.124.14 కోట్లు ఖర్చు పెట్టారు. జగనన్న విద్యా దీవెన ద్వారా 14,656 మంది విద్యార్థులకు 43.72 కోట్లు, జగనన్న వసతి దీవెనలో భాగంగా 11,312 మంది విద్యార్థులకు రూ.15.79 కోట్లు అందించారు. జగనన్న గోరుముద్ద పథకంలో 15,552 మంది విద్యార్థులకు రూ.15.49 కోట్లు, జగనన్న విద్యా కానుక పథకంలో 18,190 మంది విద్యార్థులకు రూ.10.45 కోట్లు ఖర్చు పెట్టారు.


బుట్టాయగూడెం: రెడ్డి కోపల్లిలో డిజిటల్ పాఠాలు చదువుతున్న విద్యార్థినులు (ఫైల్)


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి చేసిన జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(ఫైల్)

పేదలకు నాణ్యమైన విద్య దూరం

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వ పాలనలో పేదల చదువులకు కష్టాలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి పరుగులు పెట్టించింది. మన బడి నాడు- నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. సకల సౌకర్యాలతో అందంగా తీర్చిదిద్దింది. బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు, ఐబి సిలబస్‌తో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా చేరువ చేసింది. అయితే ఆ సంస్కరణలన్నింటికీ కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. దీనితో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతుందని అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పోలవరం నియోజకవర్గంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గడచిన ఐదేళ్లలో విద్యా రంగం అభివృద్ధి చెందింది. పేద విద్యార్థుల చదువులకు ఎనలేని కృషి చేసింది. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో జగనన్న విద్యా దీవెన పథకంలో 5016 మంది విద్యార్థులకు సుమారు రూ.26.16 కోట్లు చెల్లించారు. అదే విధంగా జగనన్న వసతి దీవెన పథకంలో 4326 మంది విద్యార్థులకు సుమారు రూ. 12.50 కోట్లు వారి ఖాతాలో జమ చేశారు. అదే విధంగా నాడు-నేడు పథకంలో సుమారు 158 పాఠశాలలకు రూ.50.69 కోట్లతో పాఠశాల రూపురేఖలను మార్చారు.

జగనన్న ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం



నాడు విద్యారంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ఆధునిక సాంకేతిక విద్యను అందించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా గొప్పలు చెప్పుకోవడం తప్ప విద్యాభివృద్ధికి చేసిన కృషి ఏమీలేదు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఎప్పుడు ఇస్తారో క్లారిటీ లేదు. కూటమి పాలనలో పేదలకు నాణ్యమైన విద్య దూరమైంది.

–గగ్గులోతు మోహన్‌రావు, వైస్ ఎంపీపీ, కోయరాజమండ్రి, బుట్టాయగూడెం మండలం

విద్యా వ్యవస్థ నిర్వీర్యం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే అమ్మఒడి డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు తల్లికి వందనం పథకంలో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున అందజేయాలి.

–మాగసాని గురుబ్రహ్మం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు

నూతన కార్యవర్గం ఎన్నిక

కుక్కునూరు: సీపీఐ కుక్కునూరు మండల సమితి నూతన కార్యవర్గ ఎంపిక ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మండల నూతన కార్యదర్శిగా కొన్నె లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా కురాకుల బాబురావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి, అయితా సురేష్, వరకా శ్యామల, వరసా పాపారావు, మడిపల్లి రమణయ్య, సోడే నగేష్, ఎకో సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి


లబ్ధిదారుకి సూచనలిస్తున్న హౌసింగ్ ఎండీ శివప్రసాద్

ద్వారకాతిరుమల: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఎం.శివప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గుణ్ణంపల్లిలో శుక్రవారం ఆయన గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే అధికారులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. అనంతరం అదే గ్రామంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది హాజరును పరిశీలించారు. యోగాంధ్ర సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎస్పీ జయరామాచారి, హౌసింగ్ పీడీ జి.సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వర్గం ఏకం కావాలి

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కొయ్యలగూడెం: భారత కార్మికవర్గం ఏకం కావాలని సీఐటీయూ నేత రాంబాబు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. విశాల భారత కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే లక్ష్యంతో ఐక్యత పోరాటం నినాదంతో 1970లో మే 30న సీఐటీయూ ఏర్పడిందని, ఇప్పటికీ 55 సంవత్సరాలు పూర్తి చేసుకుందని రాంబాబు పేర్కొన్నారు. గవర్నమెంట్ హాస్పటల్ ఎదుట ఉన్న కార్యాలయం వద్ద పతాక ఆవిష్కరణ చేశారు.

చింతలపూడిలో..

చింతలపూడి: సీఐటీయు ఆవిర్భావ దినోత్సవం చింతలపూడిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి బాలరాజు పతాకావిష్కరణ చేశారు. ఆశా యూనియన్ నాయకురాలు జి.పుణ్యవతి, లక్ష్మీప్రియ, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సరోజినీ, మాణిక్యం, మున్సిపల్ యూనియన్ నాయకు లు పద్మ, వల్లి, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు ధర్మారావు, ఝాన్సీ, జ్యోతి, అనిత పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ పతాక ఆవిష్కరణ చేస్తున్న నేతలు


చింతలపూడి: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నేతలు

కుక్కునూరులో..

కుక్కునూరు: ఐక్య పోరాటంతోనే హక్కులు సాధ్యమవుతాయని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు,సీఐటీయూ మండల కోశాధికారి బాడిస సుజాత,ఉపాధ్యక్షులు షేక్ వలీపాషా,సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్యామల లక్ష్మణ్‌రావు,డీవైఎఫ్ఐ నాయకులు పులాదాసు రమేష్, నిర్మల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే కేక్‌ను కట్‌చేసి, కార్మికులకు అందించారు. యూనియన్ నాయకులు బీఆర్ రాజు, నాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి


ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కలిగిస్తున్న సీఐ

చింతలపూడి: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీఐ సీహెచ్ రాజశేఖర్ ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఆటో ఎక్కే ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. అధిక ప్రయాణికుల లోడు, మితిమీరిన వేగం కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఆటో వెనుక 181,112,9550351100 టోల్ ఫ్రీ నెంబర్ ఉండాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై కుటుంబరావు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

4న వైఎస్సార్‌సీపీ ఆందోళనలు


సమావేశంలో మాట్లాడుతున్న గంగరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని దీనిని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. గంగవరంలో గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజుతో కలిసి పాల్గొన్నారు. కూటమి పార్టీల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. దీనికి నిరసనగా వెన్నుపోటు దినం నిర్వహించాల్సిందిగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు ఇచ్చిందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి గంటా శ్రీను, పార్టీ నాయకులు బల్లే నాగేశ్వరరావు, పాముల నాగ మునిస్వామి, ఎంపీటీసీ చింతయ్య, ఆనందరావు, దూలపల్లి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రానికి పోటెత్తిన కాలి నడక భక్తులు


సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో నృసింహ సాగరం గట్టు మీదుగా క్షేత్రానికి చేరుకుంటున్న భక్తులు

ద్వారకాతిరుమల: ఓ పక్క చిమ్మ చీకటి.. మరో పక్క వర్షం. అయినా వాటిని లెక్క చేయకుండా శ్రీవారి క్షేత్రానికి పాదయాత్ర భక్తులు శుక్రవారం రాత్రి పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, గణపవరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దూబచర్ల-అయ్యవరం మీదుగా కొండపైకి చేరుకున్నారు. అలాగే ఉయ్యూరు, గుడివాడ, ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు భీమడోలు, అదేవిధంగా ఆడమెల్లి-వెంకటకృష్ణాపురం నుంచి స్థానిక నృసింహసాగరం మీదుగా క్షేత్రానికి చేరుకున్నారు. కాలినడక మార్గాల్లో వీధి లైట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లో క్షేత్రానికి చేరుకున్నారు. పాదయాత్ర భక్తులకు దేవస్థానం సిబ్బంది ఉచిత అన్న ప్రసాదాన్ని, ఉచిత దర్శనం టికెట్లను అందజేశారు. శనివారం ఉదయం వీరంతా స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

కొయ్యలగూడెం: బయ్యనగూడెం గ్రామ దేవత శ్రీపతువులమ్మ ఆలయానికి దాతలు స్టాండింగ్ కూలింగ్ క్యాబినెట్ బాటిల్ వాటర్ డిస్పెన్సర్‌ను శుక్రవారం విరాళంగా అందజేశారు. మద్దు తేజ విశ్వనాథ్, ఆరేటి ఏసుబాబు, బాలం నరేష్, కటికి రాధాకృష్ణ, పారేపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

● వికసించిన మే పుష్పం


తాడువాయిలో విరబూసిన మే పుష్పం

మే పుష్పం వికసించి చూపరులను ఆకట్టుకుంటోంది. మండలంలోని తాడువాయి గ్రామంలో దాగం వెంకటాచార్యుల ఇంటి ఆవరణలో ఈ పుష్పం విచ్చుకుంది. మే నెలలోనే ఈ పుష్పం వికసిస్తుందని ఆయన తెలిపారు.

- జంగారెడ్డిగూడెం

ఏఎస్ఆర్ నగర్‌లో సౌకర్యాలు కల్పించాలి


ఎంపీడీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

టి.నరసాపురం: స్థానిక పంచాయతీ పరిధిలోని అల్లూరి సీతారామరాజు నగర్‌కు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు, ఏఎస్ఆర్‌నగర్ వాసులు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి, కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ ఏర్పడి 17 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఏఎస్ఆర్ నగర్‌ను టి.నరసాపురం పంచాయతీలో భాగంగా గుర్తించి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనుమోలు మురళి, మడకం కుమారి, శిరీష, బరగడ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పని చేయాలన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై మాట్లాడారు. పీపీఎస్‌చంద్రరావు, చిటికెల అచ్చిరాజు మాట్లాడుతూ సంవత్సర కాలంగా వీధిలైట్లు పని చేయడం లేదని అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అయితే వీధిలైట్లు కొనుగోలు చేసి, అవి వచ్చి నెల దాటినా ఎందుకు వీధిలైట్లను పునరుద్ధరించడం లేదని నిలదీశారు. దీనిపై చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ సంబంధిత అధికారులు దీనిపై చర్య తీసుకోవాలని, వీధి లైట్లు వస్తే ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. అలాగే కంచర్ల గీతా కుమారి మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వద్ద డ్రెయిన్ నిర్మించాలని పలు సమావేశాల్లో తాను కోరానని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. పీపీఎస్ చంద్రరావు, నంబూరి రామచంద్రరాజు మాట్లాడుతూ పట్టణంలో గల అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. సంకు సురేష్ మాట్లాడుతూ వార్డుల పట్ల వివక్షత చూపిస్తున్నారని, అన్ని వార్డులు సమానంగా అభివృద్ధి చేయాలని కోరారు. మార్చిలో పెట్టిన పనులనే ఈ సమావేశంలో పెట్టారని, అయితే తన వార్డుకు సంబంధించి గతంలో పెట్టిన పనులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పట్టణంలో పలు వార్డుల్లో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పైప్ లైన్ల ఏర్పాటుకు అజెండాలో పేర్కొన్న అంశాలను సమావేశం ఆమోదిస్తూ తీర్మానించింది. వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కమిషనర్ కేవీ రమణ, ఆర్ఐ ఎన్.సుబ్బారావు, ఏఈ రాజేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.